క్లుప్తంగా

శ్రీరామకొండ ముస్తాబు



కోయిల్‌కొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామకొండ క్షేత్రంలో ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని శ్రీరామకొండపై ప్రతి ఆదివారం అమావాస్య రోజు వేలసంఖ్యలో భక్తులు కొండపైకి చేరుకోని శ్రీరామపాదాన్ని దర్శించుకుంటారు. ఔషధ వనమూలికలతో నిండిన కోనేరులో స్నామాచరిస్తే రోగాలన్ని నయమవుతాయని, శ్రీరామపాదాన్ని దర్శిస్తే మనసులోని కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రావణమాసం కూడా కలిసిరావడంతో ఈ అమావాస్యకు భారీగా సంఖ్యలో భక్తులు శ్రీరామకొండకు తరలివస్తారని నిర్వాహకులు భావిస్తున్నారు.

నేడు అవగాహన కార్యక్రమం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బ్రైట్ ఫ్యూచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగాల సాధనపై ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు ఉమాదేవి, వసుందర, యశోద, సుగుణలు ఒక ప్రకటనలో వివరాలను పేర్కొన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అడ్వకేట్ పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నట్లు వివరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఎకామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఫేర్‌వెల్ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, హెచ్‌ఓడీ జీమ్మీకార్టన్, రాఘవేందర్, శివలింగం, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు తరలిన భజనమండలి

కోయిల్‌కొండ: మండల పరిధిలోని పారుపల్లి శ్రీనివాస భజనమండలి సభ్యులు శనివారం తిరుమలకు తరలివెళ్లారు. టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరుని సన్నిధిలో నిర్వహించే హరినామ సంకీర్తనలో వారు పాల్గొననున్నారు. రెండు రోజులపాటు సంకీర్తనల ఆలాపన చేయనున్నట్లు వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

గండీడ్: మండల పీఆర్ ఏఈగా హలీం నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన రాబర్టు జూన్ చివర్లో పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి మహమ్మదాబాద్ ఏఈ ముతీమ్ అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా బాలానగర్ నుంచి వచ్చిన హలీం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా రామకృష్ణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ మద్దిలేటి బదిలీ అయ్యారు. గండీడ్ సీహెచ్‌ఓగా గోపాల్‌రెడ్డి నియమితులు కాగా.. ఇక్కడ పనిచేస్తున్న రాములు నర్వకు బదిలీ అయ్యారు. సూపర్‌వైజర్ అలవేలు పదవీవిరమణ పొందడంతో ఆమె స్థానంలో మాగనూర్ నుంచి యాదమ్మ వచ్చారు. మరో సూపర్‌వైజర్ శాంతమ్మ పెబ్బేరుకు బదిలీ కాగా ఆమె స్థానంలో మహమ్మదాబాద్‌కు చెందిన కృష్ణవేణి వచ్చారు. గండీడ్ ఫార్మాసిస్టు రైసోద్దీన్ స్థానంలో మహమ్మదాబాద్‌లో పనిచేస్తున్న దుర్గమ్మ నియమితులయ్యారు.

కలుపు నివారణపై అవగాహన

మిడ్జిల్: బోయిన్‌పల్లి, దోనూర్, సింగందొడ్డి గ్రామాల్లో వరి, పత్తి పంటలను శనివారం దక్షిణ తెలంగాణ మండల సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, ఏరువాక కేంద్రం మహబూబ్‌నగర్ సమన్వయ కర్త భరత్‌భూషణ్‌రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి పంటలో కలుపు నివారణకు తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. వరిలో నాటు వేయుటకు వారం రోజుల ముందు నారుమడులలో 4 వందల గ్రాముల కార్బోఫ్యూరన్, 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అలాగే నాటువేసిన 3 నుంచి 5 రోజుల లోపు సిఫారసు చేసిన కలుపు మందును 20 కేజీలను ఎకరానకు ఇసుకలో కలిపి చల్లుకోవడం ద్వారా.. కలుపును నియంత్రించవచ్చని సూచించారు. నాటిన 25 రోజుల తర్వాత ఫాప్‌బ్యూటైల్, 200గ్రాముల, నెనాక్సులమ్ 25లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): టీఎన్‌జీఓలకు, నాలుగో తరగతి ఉద్యోగులకు రైతు రుణమాఫీ వర్తింప చేయాలని... టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ కృష్ణమోహన్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, పక్కన మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, పురపాలికల కమిషనర్లు తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో ఐదు రోజుల పాటు 'స్వచ్ఛదనం.. పచ్చదనం' పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగే ఈ కార్యక్రమంపై శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వచ్ఛదనం.. పచ్చదనం' విజయవంతానికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. దీనిపై పట్టణ ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వారితో కలిసి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎలాంటి వ్యాధులు సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే మహబూబ్‌నగర్ పట్టణంలో ఏడు, జడ్చర్ల ఒకటి డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. మొక్కల పెంపకంపై శ్రద్ధవహించాలని, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ కౌన్సిలర్లతోపాటు సీనియర్ సిటిజన్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఆయా వార్డులతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లోనూ స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, విషజ్వరాలు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, వీధికుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని కోరారు. కాగా, ఆయా వార్డు కమిటీల ద్వారా స్వచ్ఛందంగా ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మహబూబ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, డీఎంహెచ్‌ఓ పద్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, జడ్చర్ల, భూత్పూర్ కమిషనర్లు రాజయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు వసూలు చేయండి

జిల్లాకేంద్రంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి అద్దె బకాయిలు వసూలు చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. పట్టణంలోని 258 దుకాణాల నుంచి రూ.26 కోట్లు రావాల్సి ఉందని, అద్దె చెల్లించని దుకాణదారులకు వెంటనే నోటీసులు అందజేయాలని సూచించారు. నెలాఖరులోగా వారు స్పందించకుంటే లీజు రద్దు చేయడమే గాక క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. కాగా, కొన్ని నెలలుగా సుమారు 60 దుకాణాలను వివిధ కారణాలతో యజమానులు పూర్తిగా మూసివేశారని కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బదులిచ్చారు.

చక్రాపూర్‌లో అడిషనల్ కలెక్టర్ పర్యటన

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో శనివారం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పర్యటించారు. పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, క్రిమిటోరియం పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో నగదు నిల్వపై ఆరా తీసి ఈనెల 5 నుంచి జరిగే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి కార్తీక్ 4 ఏళ్ల సర్వీస్ పూర్తయిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వాహణను పరిశీలించారు. తర్వాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి అక్కడి సమస్యలను తెలుసుకుని ఉపాధ్యాయులతో మాట్లాడారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పాల్గొని విలేజ్ హెల్త్ న్యూట్రిషియన్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కూరగాయలను చూసి పీహెచ్ఎన్‌ఓ శకుంతలతో మాట్లాడారు. పోషక విలువలపై అవగాహన కల్పించేందుకు వాటిని ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, ఏఈలు శ్రీనివాసులు, రాజు, ఏపీఎం చారి, కార్యదర్శి మహేందర్, గ్రామస్తులు లక్ష్మీనారాయణ, ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాంరెడ్డిగూడెం పంప్‌హౌస్ పరిశీలన



రాంరెడ్డిగూడెం పంప్‌హౌస్ వద్ద మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దేవరకద్ర మార్గంలోని రాంరెడ్డిగూడెం పంప్‌హౌస్‌ను శనివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా కోయిల్‌సాగర్ నుంచి వచ్చే నీటిని ఇక్కడ ఎలా శుద్ధి చేస్తారో అడిగి తెలుసుకున్నారు. కాగా, ఎనిమిది ఫిల్టర్‌బెడ్స్‌లో ఒకటి పనిచేయకపోవడాన్ని గమనించి బాగు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈ యు.బస్వరాజ్, ఏఈలు వైష్ణవి, నుస్రత్ మొహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీ ఆవిష్కరణ..

మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చేనెల 11వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 3వ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌కు సంబంధించి.. ఆల్ కలర్ బెల్లు కతా ట్రోఫీని శనివారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ ఆవిష్కరించారు. అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కోటకదిర వెంకటేశ్ మాట్లాడుతూ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణలోని పలు జిల్లాల నుంచి కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

దేవరకద్ర: ఆంగ్లంపై ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిగా అవగాహనతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ కోరారు. శనివారం దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించడానికి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. మారుతున్న విద్యా విధానంలో ఎప్పటి కప్పుడు ఉపాధ్యాయులు పూర్తిగా శిక్షణ పొందాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు నాగేంద్రమ్మ, రామలింగం, రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

అడ్డాకుల: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాల్సిన అవసరముందని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలను శనివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. కొందరు విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 41మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మొత్తం 41మంది వాహనదారులు పట్టుబడ్డారు. శనివారం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిహారిక ఒక్కో వాహనదారుడికి రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. ఆ తర్వాత వారికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇకపై పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామని సీఐ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. చాలా వరకు మద్యం తాగి వాహనాలు నడపటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడానికి పోలీస్ శాఖ, న్యాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మిడ్జిల్: మండల పరిధిలోని పలుగ్రామాల్లో శనివారం పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యాలయాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. కంచన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ గీతాంజలి మాట్లాడారు. వానకాలంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్లపై చెత్త వేయవద్దని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని వివరించారు. వైద్యులు సౌజన్య, హెచ్‌ఎం నర్సింహులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో ప్లాస్టిక్, పేపర్ గ్లాసుల వినియోగాన్ని నివారించేందుకు ముందుకు రావాలని కాంగ్రెస్ నాయకుడు రవిరాజాచారి పిలుపునిచ్చారు. శనివారం హోటళ్ల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న 6 హోటళ్లకు తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన గాజు గ్లాసులను ఉచితంగా అందజేశారు. ఒక్కో హోటల్‌కు 24 గాజు గ్లాసుల చొప్పున పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డి, గ్రామస్తులు బాలనర్సిములు, యాట సత్యనారాయణ, సీహెచ్.రేవతమ్మ, తిరుపతి, ఖాసీం, బాలచందర్, గోవర్ధన్, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్యాలను సాధించగలం

గండీడ్: క్రమశిక్షణ, సంస్కారంతోనే లక్ష్యాలను సాధించగలుగుతామని పాలమూరు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, విశిష్ట అతిథి రఘోత్తమాచారి అన్నారు. శనివారం వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో ఆరు, ఇంటర్ తరగతుల్లో చేరిన కొత్త విద్యార్థులకు వెల్‌కం పార్టీ నిర్వహించగా.. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కొండల్‌రావు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చారిత్రాత్మకం



మాట్లాడుతున్న జహీర్ అఖ్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం చారిత్రాత్మకమని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో ఆటాడుకుందని దుయ్యబట్టారు. కాగా నిరుద్యోగ యువత సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ జాబ్ క్యాలెండర్ వేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. నిరుద్యోగులు బీఆర్‌ఎస్ నాయకుల ఉచ్చులో పడొద్దని సూచించారు. మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, నాయకులు నాగరాజు, ఫహీం పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

భూత్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గతంలో ఓపెన్ ప్లాట్లు, లేఅవుట్లకు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నుంచి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఆఖరు తేదీ ఎప్పుడన్నది ఆదేశాలు అందలేదన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం

నవాబుపేట: కారుకొండలో ఇటీవల అనారోగ్యంతో జడ్చర్ల బాల్‌రాజ్ మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ.5 వేలు సాయం ప్రకటించగా.. శనివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు భూపాల్‌రెడ్డి నగదును బాధిత కుటుంబానికి అందించారు. శ్రీనివాస్, రంగారెడ్డి, సుదర్శన్, రవీందర్, రాములు, కేశవులు, సుధాకర్, మైబు ఉన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

హన్వాడ: స్థానిక సంస్థల ఎన్నికలను జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాకే నిర్వహించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీసీ నాయకులు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, చెన్నయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసులు, మాధవులుగౌడ్, చెన్నయ్య, వెంకన్న. కాంగ్రెస్ నాయకులు ఎం సత్యయ్య, బాలగౌడ్, తిర్పతయ్య, ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య, బీజేపీ నాయకులు కృష్ణయ్యగౌడ్, రఘురాంగౌడ్, బాలగోపి, శ్రీను, మహేష్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ప్రదర్శన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సైబర్‌సెక్యూరిటీ, ఫుడ్ సేఫ్టీ, పోస్టల్ సర్వీస్ తదితర అంశాలపై విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అధ్యాపకులు ప్రవీణ, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ 'ఏ'లోకి మార్చాలి



జడ్చర్ల టౌన్: ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలని నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం జడ్చర్లలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లాకు పండుగసాయన్న పాలమూరు అని పేరు పెట్టాలని కోరారు.

హామీలను అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి సి. వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. రైస్‌మిల్ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సిములు, నాయకులు కృష్ణ, సాయిలు, బుజ్జి, బలరాం, శ్రీను, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ దీపికకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సాంబశివుడు, కొండారెడ్డి, బాలు, రాజు, బాలస్వామి, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డుపై గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..



మూసాపేట బీటీరోడ్డుపై డోజర్‌తో గుంతలను పూడ్చి వేయిస్తున్న కార్యదర్శి మహేందర్

అడ్డాకుల: మూసాపేట బస్టాండ్ వరకు 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఉన్న బీటీరోడ్డుపై కొత్త వెంచర్ వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడిన దానిపై.. గత నెల 29న సాక్షి దినపత్రికలో 'అధ్వానంగా రోడ్డు' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌గౌడ్, ఎంపీఓ అనురాధ ఆదేశాలతో శనివారం పంచాయతీ కార్యదర్శి డి.మహేందర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను బాగు చేయించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ సహకారంతో రహదారి నుంచి బస్టాండ్ వరకు రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బలను డోజర్ సాయంతో తొలగించారు. కాగా పెద్ద గుంతలు ఏర్పడే చోట నీళ్లు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

తల్లిపాలు అమృతం వంటివి



జడ్చర్ల నిమ్మబావిగడ్డ కేంద్రంలో అన్నప్రాసన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 15వ వార్డు పరిధిలోని చిన్నదర్పల్లి, చిర్మల్‌కుచ్చతండాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం స్వప్న మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని బాలింతలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, దేవమ్మ, జ్యోతి, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ తదతరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాశన నిర్వహించారు. ఆలూరు కేంద్రంలో కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, టీచర్లు యాదమ్మ, సరళ, తిరుపతమ్మ ఆశవర్కర్ నర్సమ్మ, నీలవేణి పాల్గొన్నారు. నిమ్మబావిగడ్డ కేంద్రంలో కౌన్సిలర్ రహీమొద్దీన్ పాల్గొని పోషణ గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మాంజలి, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, టీచర్లు భాగ్యలక్ష్మి, శ్రీలత, చంద్రకళ, బిల్కిస్‌లు పాల్గొన్నారు. పెద్ద ఆదిరాల రామస్వామిగుట్ట తండాలో సూపర్‌వైజర్ అరుణ, టీచర్లు హైమావతి, కవిత, ఏఎన్‌ఎం అలివేలు, ఆశ కార్యకర్త ఇందిరతోపాటు బాలింతలు, గర్భిణీస్త్రీలు పాల్గొన్నారు.

రాజాపూర్: తల్లిపాలు అమృతం వంటివని అంగన్‌వాడి సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. శనివారం రాయపల్లి అంగన్‌వాడి కేంద్రంలో వారోత్సవాలను నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రంజిత్‌కుమార్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సైద, కిశోరబాలికలు, బాలింతలు ఆయా సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డీఐఈఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. విద్యార్థులకు మాయ మాటలు చెప్పి అడ్మిషన్లు చేయించుకున్నారని.. అనుమతి లేదని తెలిసి ఇతర కళాశాలలకు వెళ్తుంటే టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తరగతుల నిర్వహణ, మెస్ సరిగా లేదన్నారు. సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్, భరత్, ఈశ్వర్, బన్నీ శివ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' నీరు అందడం లేదని ఆందోళన



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తి గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మిషన్ భగీరథ మంచి నీరు అందడంలేదని స్థానికులు శనివారం ఖాళీ బిందెలతో సమీపంలో ఉన్న ట్యాంక్ వద్ద ధర్నా చేపట్టారు. గ్రామస్తులు హరినాథ్, వేణుగోపాల్ మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యంతో సక్రమంగా నీరు అందడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం గత 20 రోజులుగా పూర్తిగా నీరు నిలిచి పోయిందన్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరు ఇవ్వాలని పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. రాజునాయుడు, గొల్లకురుమూర్తి, కోట్ల శ్రీనివాసులు, మహిళలు తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేద్దాం

నవాబుపేట/గండీడ్/కోయిల్‌కొండ: 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నవాబుపేట తహసీల్దార్ నాన్యనాయక్ సూచించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమంపై అధికారులకు సూచనలు చేశారు. తమకు కేటాయించిన గ్రామాల్లో పాల్గొనాలని తెలిపారు.

- ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం ఉంటుందని గండీడ్ ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. ఆయా రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శనివారం సూచనలు చేశారు.
- స్వచ్ఛదనం- పచ్చదనంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కోయిల్‌కొండ ఎంపీడీఓ కాశప్ప తెలిపారు. వివిధ అంశాలపై శనివారం సూచనలు చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు

గండీడ్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గండీడ్, మహమ్మదాబాద్‌ల పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛదనం- పచ్చదనంపై సమావేశం నిర్వహించారు. కాగా ఐదుగురు హాజరు కాలేదు. వీరిలో ధర్మాపూర్ కార్యదర్శి మల్లికార్జున్, దేశాయిపల్లికి చెందిన రవీందర్, ఆశిరెడ్డిపల్లి నేహబేగం, జిన్నారం మోహన్, వెన్నాచేడ్ కృష్ణనాయక్ ఉన్నారు. కాగా ఎంపీడీఓ దేవన్న సమావేశానికి రాని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈమేరకు సిబ్బంది నోటీసులు అందజేశారు.

వర్గీకరణతో మేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎం.సాయిబాబా అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ శనివారం సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శంకర్, యాదయ్య, మల్లేష్, యాదయ్య, కేశవులు, మల్లికార్జున్, నర్సింలు, వెంకటేశ్, ప్రేమ్‌చంద్, కావలి రాములు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొక్కిరాములు, ఉద్యమ కళాకారులు కె.కిరణ్, బీజేపీ నాయకుడు బాలగోపి, ఎర్రబాలయ్య, కుర్మయ్య, రాంచందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

- బంగారు నగలు, నగదు అపహరణ

అడ్డాకుల: వేములలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ పి.శ్రీనివాసులు కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ఉంద్యాల అనంతరెడ్డి దంపతులు గత నెల 25న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ప్రైవేటులో ఉద్యోగం చేసుకునే తమ కుమారుడు శేఖర్‌రెడ్డి వద్దకు వెళ్లారు. అయితే శనివారం అనంతరెడ్డి ఇల్లు తెరుచుకుని ఉండటంతో ఎదురింట్లో ఉండే కోడికె శ్రీకాంత్ ఆయనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చిన అనంతరెడ్డి, శేఖర్‌రెడ్డి తమ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. రెండు తులాల బంగారు నగలు, కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎల్కిచర్లలో..

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఖాదరయ్య ఇంటికి తాళం వేసి బిజ్నాపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగొట్టారు. బీరువా పగులగొట్టి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. అదేరోజు రాత్రి కుర్మయ్య ఇంటికి వేసిన తాళం విరగొట్టి 30 తులాల బంగారు దీపం చెమ్మెలు, బీరువాలో ఉన్న 4 గ్రాముల చెవి కమ్మలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గాలి దుమారంతో దెబ్బతిన్న ఇళ్లు



నవాబుపేట: మండల పరిధిలోని లోకిరేవు, లింగంపల్లి, చౌటపల్లి గ్రామాల్లో శనివారం గాలి దుమారంతో చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. అదేవిధంగా లోకిరేవులో పశువుల కొటాలు, వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల విడిది భవనం రేకులు సైతం గాలికి ఎగిరిపోయాయి.